

శ్రీ కృష్ణ శతకం

శ్రీ కృష్ణ శతకంలోని కొన్ని పద్యాలు సంకలనం చేసి నాకు అందించిన నాన్నగారు శివ రామ శర్మ గారికి అభివందనం. ప్రస్తుతం శతకం అసంపూర్ణంగా ఉంది. ఈ శతకంలోని ప్రతి పద్యం త్వరలో మీ ముందుకు తీసుకుని రావటానికి ప్రయత్నిస్తాను. ఎక్కడన్నా తప్పులు కనపడితే సరిదిద్దమని విన్నపము.

సర్వేజనా సుఖినోభవంతు. ఆ కృష్ణ పరమాత్మ ఆశీర్వాద సుమాలు ప్రతి కుటుంబం మీద కురవాలని కోరుకుంటూ

వంశీ

శ్రీ రుక్మిణీశ ! కేశవ !
నారద సంగీతలోల ! నగధర ! శౌరీ !
ద్వారకనిలయ ! జనార్దన !
కారుణ్యముతోడ మమ్ము కావుము కృష్ణా !

నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడు నీడ నీవే సఖుడా
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా !

హరియను రెండక్షరములు
హరియించును పాతకములు నంబుజనాభా!
హరి నీ నామమహత్త్యము
హరిహరి పొగడంగ వశమె హరి శ్రీ కృష్ణా!

చిలుక నొక రమణి ముద్దుల
చిలుకను శ్రీరామ యనుచు శ్రీపతి పేరం
పిలిచిన మోక్షము నిచ్చితి
వలరగ మిము తలచు జనుల కరుదా కృష్ణా!

నందుని ముద్దుల పట్టివి
మందరగిరిధరుని హరిని మాధవు విష్ణున్
సుందరరూపుని మునిగణ
వందితు నినుదలతు భక్తవత్సల కృష్ణా !

అష్టమి రోహిణి ప్రొద్దున
అష్టమ గర్భమున బుట్టి యా దేవకికిన్
దుష్టుని కంసు వధింపవె
సృష్టి ప్రతి పాలన సేయగ కృష్ణా!

దిక్కెవ్వరు ప్రహ్లాదుకు
దిక్కెవ్వరు పాండుసుతుల దీనుల కెపుడున్
దిక్కెవ్వర య్యహల్యకు
దిక్కెవరు నీవె నాకు దిక్కువు కృష్ణా!

బలమెవ్వడు కరి బ్రోవను
బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్
బలమెవ్వడు సుగ్రీవుకు
బలమెవ్వడు నాకు నీవె బలమౌ కృష్ణా!

దండమయా! విశ్వంభర!
దండమయా! పుండరీక దళనేత్ర! హరీ!
దండమయా! కరుణానిధి!
దండమయా! నీకునెపుడు దండము కృష్ణా!

అక్రూర వరద, మాధవ,
చక్రాయుధ, ఖడ్గపాణి, శౌరి, ముకుందా,
శక్రాది దివిజ సన్నుత,
శుక్రార్చిత నన్నుఁ గరుణఁ జూడుము కృష్ణా!

కుంభీంద్ర వరద, కేశవ,
జంభాసురవైరి, దివిజ సన్నుత చరితా,
యంభోజనేత్ర, జలనిధి
గంభీరుడ, నన్నుఁ గావుము కృష్ణా!

దివిజేంద్ర సుతుని జంపియు
రవి సుతు రక్షించినావు రఘురాముఁడవై,
దివిజేంద్ర సుతుని గాచియు
రవి సుతుఁ బరిమార్చితౌర రణమున కృష్ణా!

నారాయణ, పరమేశ్వర,
ధారాధర, నీలదేహా, దానవవైరీ,
క్షీరాబ్ధి శయన, యదుకుల
వీరా, ననుగావు రుణవెలయగ కృష్ణా!

నారాయణ లక్ష్మీపతి!
నారాయణ వాసుదేవ, నందకుమారా!
నారాయణ నిను నమ్మితి,
నారాయణ నన్నుఁ బ్రోవు నగధర కృష్ణా!

నీవే తల్లివి, తండ్రివి,
నీవే నా తోడు నీడ, నీవే సఖుడా,
నీవే గురుడవు, దైవము,
నీవే నా పతియు, గతియు నిజముగ కృష్ణా!

మడుగుకుఁజని కాళింగుని
పడగలపై భరతశాస్త్ర పద్ధతి వెలయం
గడు వేడుకతో నాడెడు
నడుగులు నే మదిని దాల్తు నచ్యుత కృష్ణా!

హరి ! నీవే దిక్కు నాకును!
సిరితో యేతెంచి మరి శిక్షించి దయన్
పరమేష్ఠి, సురలు బొగడఁగఁ,
గరిఁ గాచిన రీతి నన్నుఁ గావుము కృష్ణా!

అనుదినము కృష్ణ శతకము
పినిన(బఠించినను ముక్తి పీడుక(గలుగున్
ధనధాన్యము గోగణములు
తనయులు నభివృద్ధి(బొందు(దద్దయు కృష్ణా !



Keywords: SrI kRshNa Satakam, sree Krishna satakam, telugu lO sataka padyAlu, Satakamu, telugu sAhitya sumAlu

www.maganti.org
Vamsi M Maganti
contact@maganti.org